హౌసింగ్ బోర్డు ఉద్యానవనంలో చెత్తను తొలగిస్తున్న కలెక్టర్

# పరిహారం కోసం ఎదురుచూపు..!

◆ 2024 నుంచి ఇప్పటి వరకు నిధుల విడుదల్లేదు

◆ పంటనష్టపోయిన అన్నదాతకు సాయం కరువు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

ప్రకృతి వైపరిత్యంతో దెబ్బతింటున్న పంటకు ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో అంటే 2024 ఖరీఫ్‌కు సంబంధించి జరిగిన పంటనష్టానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇప్పటికీ అందలేదు. అధిక వర్షాలు కూడా గతేడాది వచ్చాయి. వీటి వల్ల ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది మార్చిలో అకాల వర్షాలతోనూ పంటలు దెబ్బతిన్నాయి. ఒకవైపు వర్షాభావం, మరోవైపు అధిక వర్షాలు రెండింటి వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. ఈ ఏడాది ఖరీఫ్ కూడా ముగింపునకు వచ్చింది. ఈ సమయంలోనైనా ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అనంతపురం జిల్లాలో బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, విడపనకల్లు, యాడికి, అనంతపురం, నార్పల ఏడు మండలాల్లో వర్షాభావం నెలకొంది. ఈ మండలాలను కరువు మండలాలుగానూ ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 12,678 మంది రైతులకు సంబంధించి 12,856 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు. రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సత్యసాయి జిల్లాలో 46,836 మంది రైతులకు రూ.62.46 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంది. అక్టోబర్‌లో అధిక వర్షాల వల్ల అనంతపురం జిల్లాలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. వీటికి సంబంధించి రూ.15 లక్షల వరకు పరిహారం రావాల్సి ఉంది. సత్యసాయి జిల్లాలో రూ.49.11 లక్షలు పరిహారం రావాలి. 2024 నవంబర్, డిశెంబర్, ఈ ఏడాది మార్చి నెలల్లోనూ అధిక వర్షాలతో రైతులు పండించిన పంటలు దెబ్బతిన్నాయి. వీటికి సంబంధించి నష్టపరిహారాన్ని అధికారులు అంచనావేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటి వరకు రైతులకు పరిహారం మంజూరవలేదు. ఎప్పుడు విడుదలవుతాయో కూడా తెలియని పరిస్థితి ఉంది. 2025 ఖరీఫ్ కూడా పూర్తికావొచ్చింది. ఈ ఏడాది వర్షాభావం, అధిక వర్షాలు రెండింటి మూలంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతేడాది పంటనష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ అయినా మంజూరు చేస్తే కొంత ఊరట లభించే అవకాశం ఉండనుంది. సీజన్ ప్రారంభంలో ఈ ఏడాది వర్షాభావంతో పంటల సాగు కూడా ఆశించినంత జరగలేదు. ప్రధాన పంట అయిన వేరుశనగ మరింత తక్కువగా ఈ ఏడాది సాగైంది.

### ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలి

ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణం విడుదల చేయాలి. గతేడాది పంటనష్టం జరిగితే ఇప్పటి వరకు ఇవ్వలేదు. గతేడాది కరువు మండలాల ప్రకటనే తక్కువగా ఉంది. కరువు మండలాలను తక్కువగానే ప్రకటించారు. అందులోనూ పరిహారం ఇవ్వకుండా జాప్యం సరైంది కాదు. అది కాకుండా అక్టోబర్, ఈ ఏడాది మార్చి నెలల్లో అకాల వర్షాల వలన కూడా రైతులు పంటలు నష్టపోయారు. వారికి తగినంత సహాయం అందించి ఆదుకోవాలి. తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీని విడుదల చేసి జిల్లా రైతులను ఆదుకోవాలి.

**జంగాలపల్లి పెద్దన్న,**
**ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.**

## స్వచ్ఛ హిందూపురంగా మారుద్దాం

### పిఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి
### కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్

**ప్రజాశక్తి-హిందూపురం**

స్వచ్ఛ హిందూపురంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ రోజూ ఒక గంట శ్రమించి పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం నాడు హిందూపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ మున్సిపల్ పార్క్ వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛతాహి సేవలో భాగంగా "ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్" నినాదంతో చేపట్టిన శ్రమదాన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జునలతో కలిసి పాల్గొన్నారు. స్థానికులతో కలిసి పరిసరాల్లో చెత్తను ఏరివేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మొక్కలు నాటి, పెంచి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. పట్టణ పరిశుభ్రతలో బాగా కృషిచేసిన 8 మంది మున్సిపల్ శానిటేషన్ కార్మికులకు కలెక్టర్ జ్ఞాపికలు ఇచ్చి సత్కరించారు.

**పిఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి**

హిందూపురం పట్టణం సప్పల్లమ్మ వీధి సుగూరులో పీఎం సూర్య ఘర్ సబ్సిడీ పథకం ద్వారా లబ్ధిదారు జి.నర్మద ఇంటిపై 3.24 కిలోవాట్లతో ఏర్పాటు చేసుకున్న రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌ను కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు వాకర్స్ అసోసియేషన్, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**చెత్త రీసైక్లింగ్ పరిశీలన**

హిందూపురం పట్టణానికి సంబంధించి మోతుకపల్లి డంప్ యార్డును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోజువారీ చెత్త ఎంత ఉత్పత్తి అవుతుందని ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునలతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక రోజుకు 73 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని మున్సిపల్ కమిషనర్ కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. గత 45 సంవత్సరాలుగా అక్కడ చెత్తను డంప్ చేస్తున్నట్లు వివరించారు. కొత్త డంప్ యార్డ్ ఏర్పాటుకు వేగంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## 'దీపం' రాయితీ సమస్యలను పరిష్కరించండి

### జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

జిల్లాలో దీపం-2 పథకం కింద రాయితీ జమకాని లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పౌరసరఫరాల డిప్యూటీ తహశీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ బ్యాంకులలో రాయితీ జమ కాని లబ్ధిదారుల వివరాలను అందజేయాలని సూచించారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా రాయితీ జమ అయ్యే విధంగా బ్యాంకులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతివారం డిప్యూటీ తహశీల్దార్లు ఈ అంశంపై పర్యవేక్షించాలన్నారు. రాయితీ మొత్తం బ్యాంకులలో ఎందుకు జమ కాలేదన్న విషయాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రమణ కుమార్, జిల్లాలోని డిప్యూటీ తహసీల్దార్లు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## వాస్తవాల అక్షర రూపం ప్రజాశక్తి

### ప్రత్యేక సంచిక ఆవిష్కరణలో కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్

**ప్రజాశక్తి-హిందూపురం**

వాస్తవాలను అక్షర రూపంలో ప్రజలకు చేరవేసే పత్రిక ప్రజాశక్తి అని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ప్రజాశక్తి 45వ వార్షికోత్సవం సందర్భంగా ప్రచురించిన ప్రత్యేక సంచికను గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలకు కట్టుబడి నిజాన్ని నిర్భయంగా ప్రజలకు చేరవేయడం ప్రజాశక్తికే సాధ్యమన్నారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ కథనాలు రాస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడూ ప్రజలకు చేరవేస్తోందని తెలిపారు. ప్రతి అక్షరం ప్రజల పక్షంగా నిలిచిన ప్రజాశక్తి ఇలాంటి వార్షికోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం విలేకరి షబ్బీర్ పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

**ప్రజాశక్తి-హిందూపురం**

హిందూపురం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 25న ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఫార్మసిస్టు ఆరోగ్య సంరక్షణ సేవలను, ముఖ్యంగా ప్రజలకు ఔషధాల లభ్యతను అందించడంలో వారి పాత్ర చాలా గొప్పదని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి అనిల్, కోశాధికారి రాజేష్, కార్యవర్గ సభ్యులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి : సిఐటియు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కార్మిక చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, 13 గంటల పని విధా నాన్ని రద్దు చేసి 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద కార్మికులు నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు నరేంద్ర మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తూ కార్మికుల శ్రమను దోచుకునేందుకు 10 నుంచి 13 గంటల పాటు పని చేయాలని నిబంధన పెట్టడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు మరొక అడు గు ముందుకేసి కేబినెట్, అసెంబ్లీలో నిర్ణయం చేయడం అన్యాయం అన్నారు. 8 గంటల పని విధా నాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి బత్తల సాంబ శివ, జగన్మోహన్, రామ్మోహన్, బాబ్‌జాన్, మున్సిపల్ కార్మికులు తిరుపాల్, రాజు, చిన్నకృష్ణ, దివాకర్, హరి, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

## ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ కాకుంటే ప్రజలకు నష్టం

### 'సేవ్ ఆర్‌డిటి' అఖిలపక్ష సమావేశంలో నాయకులు

రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్‌డిటి) విదేశీ నిధులకు సంబంధించి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్(ఎఫ్‌సిఆర్‌ఎ)ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌డిటి పరిరక్షణకై గురువారం డాక్టర్ ఆదిశేషు, సాకే వినయ్ అధ్యక్షతన పట్టణంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, ఆర్‌డిటి క్లస్టర్లు హాజరయ్యారు. ఆర్‌డిటి పరిరక్షణ కమిటీ ఉద్యమ కార్యాచరణకు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆర్‌డిటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో దశాబ్దాలుగా విద్య, వైద్యం, వికలాంగులకు సహాయం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, తదితర రంగాల్లో విశేష సేవలు అందిస్తుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయకపోవడం వల్ల ఆ సంస్థకు విదేశీ నిధులు అందక ఆయా సేవ లు నిలిచిపోతున్నాయన్నారు. కొన్ని నెలలుగా ప్రజలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేపడుతున్నా కేంద్రం నుంచి సానుకూల స్పందన రాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, రైల్‌రోకో, జాతీయ రహదారుల దిగ్బంధం, జిల్లా బంద్, తదితర కార్యక్రమాల పేరుతో ఉద్యమ కార్యాచరణకు ముక్తకంఠంతో సంపూర్ణ మద్దతు తెలిపారు. అలాగే ఉమ్మడి జిల్లా సేవ్ ఆర్డీటీ అఖిలపక్ష కమిటీకి అనుబంధంగా ధర్మవరం నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 29వ తేదీ కేంద్ర కార్యాలయాలు (పోస్ట్ ఆఫీస్, బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల వద్ద) ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అఖిలపక్ష కమిటీలు ఏర్పాటు చేసి, పోరాటాన్ని మరింత ఉధృతంగా కొనసాగించనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో అందరూ చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## క్రాప్ బుకింగ్, పంట నష్టపరిహారంలో వివక్ష వద్దు

వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘం నాయకులు

**ఓబుళదేవరచెరువు :** మండల వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులందరి పొలాల్లో వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ చేయాలని, అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే చేయడం తగదని ఆర్‌సిపి పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా, ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామ చంద్ర కోరారు. ఈ మేరకు గురువారం తహశీల్దార్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లా డుతూ అధికార పార్టీ నాయకులు చెప్పిన రైతులకు మాత్రమే వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ చేస్తున్నారని, వీటిపై పూర్తి విచారణ జరిపి అర్హులైన రైతులకు ఈ క్రాప్ బుకింగ్ చేయాలన్నారు. అలాగే పంట నష్టపోయిన రైతులకు కాకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి మాత్రమే పంట నష్టపరిహారం జరిగినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని, వీటిపై సమగ్ర విచారణ చేసి నిజమైన రైతులకు పంట నష్టపరిహారం జరిగేలా చూడాలని కోరారు. లేనిచో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

## అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

### సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

శ్రీ సత్యసాయి జిల్లా ఐసిడిఎస్ 12 ప్రాజెక్టుల్లో పని చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐసిడిఎస్ పీడీ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం నాడు జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో అధికారుల ఆధ్వర్యంలో జాయింట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్.వెంకటేష్, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 2020 సంవత్సరం నుంచి వివిధ ప్రాజెక్టులలో నెల నుంచి పది నెలలు వరకు కొంతమందికి బకాయి బిల్లులు ఉన్నాయన్నారు. కూరగాయలు, సెంటర్ల అద్దెలు, రిటైర్మెంట్స్ బెనిఫిట్స్, తదితర సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. మినీ వర్కర్లకు సంబంధించి జాబితాలో ఉన్న వారితో పాటు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారందరి పేర్లు నమోదు చేయాల్సి ఉందన్నారు. ప్రాజెక్టులలో తగినంత మంది సూపర్‌వైజర్లను నియమించాలన్నారు. ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్లకు బకాయి ఉన్న వేతనాలను చెల్లించాలన్నారు. అర్హత ఉన్న హెల్పర్ల ఉద్యోగోన్నతలు కల్పించాలన్నారు. ఉద్యోగోన్నతుల విషయంలో రాజకీయ జోక్యాన్ని నివారించాలని తెలియజేశారు. ఈ సమస్యలపైన ఐసిడిఎస్ పీడీ ప్రమీల స్పందించారు. సమావేశంలో చర్చకు వచ్చిన సమస్యలన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి రంగమ్మతో పాటు 12 ప్రాజెక్టుల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు పాల్గొన్నారు.

## ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్

మాట్లాడుతున్న జిల్లా న్యాయసేధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

ఖైదీలు నేరం చేసినప్పుడు తప్పా, ఒప్పా అని ఆత్మపరిశీలన చేసుకోవాలని, అప్పుడే నేర ప్రవృత్తి నుంచి బయటపడగలుగుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.రాజశేఖర్ సూచించారు. ఆయన గురువారం కదిరి సబ్ జైలును సందర్శించారు. అలాగే అక్కడ నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. లోక్ అదాలత్ ద్వారా నేరంలో ఇరుక్కున్న వారి ఆర్థిక పరిస్థితులను బట్టి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. శిక్ష పడిన తర్వాత కూడా పై కోర్టులో అప్పీల్ చేసుకునే సందర్భంలోనూ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందన్నారు. పేద మధ్యతరగతి వర్గాలకు ప్రజా న్యాయస్థానాల్లో ఎన్నో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. అత్యంత పేదలకు జామీను ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం, ఉన్నత న్యాయస్థానాలు కల్పించిన అవకాశాలను మంచి కోసం మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. మార్పు ద్వారా మనిషిలో మంచి వ్యక్తిని చూడగలమని, ఆ ప్రయత్నం చేయాలని హితవు పలికారు. అనంతరం సబ్ జైలులో ఉన్న ఖైదీలకు ఇస్తున్న భోజనం, నిల్వ ఉన్న సరుకులను పరిశీలించారు. వారికిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. ఖైదీలనే చులకన భావన లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, కె.నరసింహులు, వెంకటేష్, రఘునాథ్, సభ్యులు, అధికారి ఉమామహేశ్వర్ నాయుడు ఉన్నారు.

## నేటి నుంచి డిగ్రీ రెండో విడత అడ్మిషన్లు

**ప్రజాశక్తి-హిందూపురం**

డిగ్రీ రెండో విడత అడ్మిషన్లకు ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి గురువారం తెలియజేశారు. ఇప్పటి దాకా రిజిస్టర్ చేసుకోని విద్యార్థులు, డిగ్రీలో చేరాలనే ఆసక్తి గల విద్యార్థులు 29లోపు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చునని చెప్పారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఈ నెల 27 నుంచి 29 వరకు ఉంటుందని, 29 నుంచి అక్టోబర్ 1 వరకు విద్యార్థులకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. గతంలో రిజిస్టర్ చేసుకుని అప్లికేషన్ పెండింగ్‌లో ఉన్న వారు, తిరస్కరించబడిన వారు తిరిగి తమ లాగిన్ ద్వారా సర్టిఫికెట్లను అప్ లోడ్ చేసుకోవాలన్నారు. వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోని వారు, ఇతర కళాశాలలు, కోర్సుల్లో చేరి మార్చుకోవాలనుకున్న వారు కావాలనుకుంటే ఆప్షన్లు ఇచ్చుకోవచ్చునని సూచించారు. మరిన్ని వివరాలకు కళాశాల పని దినాలలో సంప్రదించాలని తెలిపారు.

## నవంబర్‌లో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా ఉత్సవాలు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

నంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు సాంస్కతిక ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ శ్యాంప్రసాద్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం స్థానిక కలెక్టరేట్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 7, 8, 9వ తేదీల్లో మూడు రోజులపాటు ఈ క్రీడలు, సాంస్కతిక ఉత్సవాలు అనంత ఆర్డీటీ క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడమే ఈ క్రీడల ముఖ్య ఉద్దేశం అన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్డీటీ మైదానంలో జరిగే క్రీడా పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా క్రీడాకారులకు డ్రెస్ కోడ్ రంగులు లాటరీ పద్ధతి నిర్వహించి ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెవెన్యూ ఉద్యోగులు ఈ క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఉపాధ్యక్షులు సోమశేఖర్, జిల్లా అధ్యక్షులు దివాకర్, గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారి రామ సుబ్బయ్య, సత్యసాయి జిల్లా ఆర్డీవోలు సువర్ణ, మహేష్, వివిఎస్ శర్మ పలువురు తహశీల్దార్లు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో కూటమి నాయకులు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయినగర్, దుర్గానగర్, కొత్తపేటలో గురువారం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమంలో చిలకం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లడుతూ లబ్ధిదారులకు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందించడానికి నూతన స్మార్ట్ రేషన్ కార్డులు ఉపయోగపడతాయన్నారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో అవినీతి, మధ్యవర్తిత్వం తగ్గిపోతుందన్నారు. అర్హులైన కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేరేలా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**హిందూపురం :** రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులు పారదర్శకంగా పంపిణీ చేయడానికి స్మార్ట్ రైస్కార్డులు ఉపయోగపడ తాయని ఎంఎల్ఎ నందమూరి బాలకృష్ణ పీఏ వీరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని నింకంపల్లి, రూరల్ మండలం కిరికెర గేట్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యూఆర్ ఆధారిత స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్కుమార్, డిప్యూటీ తహశీల్దార్ హారతి, ఇన్ఛార్జి ఎంపిడిఓ శివ కుమార్, టిడిపి రూరల్ అధ్యక్షులు రాము, రేషన్ డీలర్స్ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నాయకులు అరుణాచలరెడ్డి, ప్రదీప్, శ్రీరాములు, ఎంపీటీసీ నాగరాజు, మాజీ ఎంపీటీసీలు ఆంజనేయులు, రామచంద్ర, అంజన రెడ్డి, అంజి, ఉమాశంఖరరెడ్డి, నారాయణప్ప, మూర్తి, జయరాం పాల్గొన్నారు.

**కొత్తచెరువు :** మండల వ్యాప్తంగా 34 చౌకధాన్యం డిపోలు ఉండగా 13,461 స్మార్ట్ కార్డులు మంజూరయ్యాయని ఇన్ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. వాటిని సచివాలయ సిబ్బంది, డీలర్లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. లబ్ధిదారులకు కేటాయించిన షాపులో వాటిని అందజేస్తారన్నారు. స్థానిక బీసీ కాలనీలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నూతన ఈపాస్ యంత్రాల ద్వారా రేషన్కార్డుదారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో విఆర్ఓ భార్గవ్, టిడిపి పట్టణ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాయకులు వెంకటేశు, పెద్దన్న పాల్గొన్నారు.

**అగళి :** స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని వేగవంతం చేయాలని తహశీల్దార్ సుబ్బారావు ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో విఆర్ఓలు, విఆర్ఎలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాటాడుతూ ఈ స్మార్ట్ కార్డు పోగొట్టుకుంటే తిరిగి ఇవ్వరన్నారు. కావున మరొక కాపీని తయారుచేసుకుని భద్రపరచాలన్నారు. స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు.


పురంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే బాలయ్య పిఎ వీరయ్య

**పరిగి :** మండల వ్యాప్తంగా ఈ నెల 1వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులతోనే రేషన్ బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహశీల్దార్ హసీనా సుల్తానా వెల్లడించారు. స్థానిక చౌక దుకాణం-1 వినియోగదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ సభ్యులు సూర్యనారాయణ, సోమప్ప, సంజీవరాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

**గోరంట్ల :** పట్టణంలోని రామశంకరయ్య కాలనీ సమీపంలో సిఎస్డిటి శ్రీధర్రావు ఆధ్వర్యంలో కూటమి నాయకులు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు సోమశేఖర్, నరేష్, నాగరాజు, భాస్కర్రెడ్డి, ఉత్తమరెడ్డి, వెంకటేష్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** పట్టణంలోని 1, 2 సచివాలయ పరిధిలో, ఎబి పల్లి తండా సచివాలయం పరిధిలో టిడిపి నాయకులు తుమ్మల మనోహర ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎ.ఆనంద్, ఎం.నారాయణస్వామి, తిరుపాల్, జి.రామాంజనేయులు, అశోక్, ఎల్.నారాయణస్వామి, హరి, గుర్రప్ప బాలకృష్ణ, ఎన్.వినయ్కుమార్, సూర్యనారాయణ, వెంకటకృష్ణ, డీలర్ చంద్రసేన పాల్గొన్నారు.

**సోమందేపల్లి :** మండలంలోని మాగే చెరువు పంచాయతీలో ఇన్ఛార్జి తహశీల్దార్ మారుతి ఆధ్వర్యంలో సర్పంచి నరసింహులు, ఉప్పర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రాముడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, మండల కన్వీనర్ వెంకటేష్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు.

**రొద్దం :** మండలంలోని నారనాగేపల్లి, లోచర్ల, నల్లూరు గ్రామాల్లో అధికారులు, టిడిపి నాయకులు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు.

# పారిశుధ్యంపై అవగాహన

## కార్మికులకు సన్మానం, వైద్యసేవలు

పరిగిలో పారిశుధ్య కార్మికులను సన్మానించిన తహశీల్దార్, డిప్యూటీ ఎంపిడిఒ, అధికారులు

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

రూరల్ మండలంలోని పోతుకుంట గ్రామపంచాయతీ పరిధిలోని బృందావన కాలనీలో గురు వారం 'ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్' కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటేష్చౌదరి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అలాగే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి శ్రమదానం చేశారు. గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లు, క్లాప్ మిత్రులను సత్కరిం చారు. వారికి బెల్లం, విటమిన్లతో నిండిన పండ్లు అందజేశారు. 'ప్రజా ఆస్తి పరిరక్షణ'పై సూచనలు చేశారు. ప్రజా ఆస్తిని దుర్వినియోగం చేయరాదని సూచించారు. అనంతరం ట్యాప్ లీకేజీలను గుర్తించి సరి చేశారు. 'సూపర్ జిఎస్టి-సూపర్ సేవింగ్స్'పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశా, అంగన్వాడీ వర్కర్లు, నాయకులు పాల్గొన్నారు.

**తాడిమర్రి :** తాడిమర్రిలో శ్రమదానం, స్వచ్ఛత హి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. సఫాయి మిత్రలను సన్మానించారు. సఫాయి మిత్రలతో కలిసి ర్యాలీగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయించారు. వైద్యాధికారి వారికి పలు ఆరోగ్య సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రంగారావు, ఎపిఒ అనిల్కుమార్రెడ్డి, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ, ఆర్డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

**నల్లమాడ :** స్వచ్ఛత హి సేవ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ అమర్నాథ్రెడ్డి, వైద్యాధికారి బాబాఫకృద్దీన్, పంచాయతీ కార్యదర్శులు దాదాసాహెబ్, వెంకటేష్నాయక్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణ్నాయుడు, కోట్లో మంజునాథ్రెడ్డి, అరవింద్బాబు, రామచంద్ర, బాబావలి, కె.బయారెడ్డి, ఎం.రవికుమార్, అశోక్కుమార్, అమర్నాథ్, డి.హనుమంత్రెడ్డి, కేశవరెడ్డి, సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పరిగి :** పరిగిలో ఎంపిడిఒ రెడ్డప్ప ఆధ్వర్యంలో స్వచ్ఛత హిసేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. స్వచ్ఛత కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ హసీనాసుల్తానా, డిప్యూటీ ఎంపిడిఒ విజయ భాస్కర్, పిఆర్ ఇంజినీర్ నాగప్ప, మండల కన్వీనర్ గోవింద రెడ్డి, సూర్యనారాయణ, శ్రీనివాసులు, సింగిల్విండో అధ్యక్షుడు చెన్నకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** స్థానిక పిహెచ్సిలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ధనుర్వాతం, కాలేయ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. వైద్యులు లావణ్య, రోజా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శుభ్రత, ముందుజాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త జయచంద్ర కుమార్, పర్యవేక్షక సిబ్బంది పద్మావతి, పంచాయతీ కార్యదర్శి సావిత్రి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**సోమందేపల్లి :** స్థానిక సాయి నగర్లో అధికారులు పరిసరాలు శుభ్రం చేశారు. మండల వైద్యాధికారి ఓంకార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రజలు స్వచ్ఛత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్ఛార్జి ఎంపిడిఒ నర్సింగారావు, ఎంఇఒ ఆంజనేయనాయక్, ఎపిఒ సోమశేఖర్రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఆర్డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

**లేపాక్షి :** చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ , ఎంపిడిఒ నరసింహమూర్తి మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్తతో సంపద సృష్టించవచ్చు అన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్క లు నాటాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

## టిడిపి నేతల ఆర్థిక సాయం

**చిలమత్తూరు :** మండలంలోని మొరసలవాండ్లపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే టిడిపి కార్యకర్తలు, నాయకులు స్పందించి రామిరెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. అలాగే పార్టీ తరఫున రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డిష్ అంజి, మురళి, బొట్టు మూర్తి, క్రిష్టప్ప, నరసింహా, రామాంజి, బాలాజీ, నరసింహారెడ్డి, వెంకటరమప్ప, రామాంజినేయులు పాల్గొన్నారు.

## రైతులు యూరియా తీసుకెళ్లండి

**గుడిబండ :** మండలంలోని జంబులబండ, రాళ్లపల్లి, సిసి.గిరి రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి వీరనరేష్ గురువారం తెలిపారు. అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రం అధికారి వద్ద ఆధార్, 1-బి చూపించి యూరియా తీసుకెళ్ల వచ్చని ఏవో తెలిపారు.

## కంటి వైద్యశిబిరం

**నల్లమాడ :** స్థానిక జడ్పీ హై స్కూల్లో గురువా రం విజన్ కేర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఇందులో పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, మణికుమారి, మైలే రామచంద్ర, కె.మంజునాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేకాట జూదరులు అరెస్టు

**ధర్మవరం రూరల్ :** రూరల్ మండలంలోని గరుడంపల్లి గ్రామ శివారులో గురువారం పేకాట స్థావరంపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దాడుల్లో ఆరుగురు పేకాట జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 14,350 నగదు ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ముఖ్యమంత్రిపై వైసిపి ఎమ్మెల్సీ వ్యాఖ్యలు సరికాదు

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

సిఎం చంద్రబాబుపై వైసిపి ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ శాసనమండలిలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని స్థానిక టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. వారు గురువారం ఆ ఎమ్మెల్సీ చిత్ర పటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మాట్లా డుతూ శాసనమండలిలో రమేష్యాదవ్ సూపర్ సిక్స్ పథకాలు అమలు కాలేదని, కావాలంటే కుప్పం ఎమ్మెల్యే విచారించాలని అవమానకరంగా మాట్లాడారన్నారు. సిఎం హోదాను మరచి ఎమ్మెల్యేగా వ్యాఖ్యానించడం తగదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. కుప్పమే కాదు ఏ నియోజకవర్గంలోనైనా సరే అమలుపరిచిన పథకాలపై చర్చకు రావాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో ఐ టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు జయప్రకాష్, నాయకులు భీమనేని కృష్ణప్ప, సాయికుమార్, నారాయణస్వామి, చెన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్యాదవ్ చిత్రపటాన్ని దహనం చేస్తున్న టిడిపి నాయకులు

## గొట్లూరు సహకార సంఘం చైర్మన్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

మండలంలోని గొట్లూరు సహకార సంఘం చైర్మన్గా గురువారం మాజీ జడ్పీటీసి మేకల రామాంజనేయులు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు టిడిపి నాయకులు చింతలపల్లి మహేష్ చౌదరి, సందా రాఘవ, కమతం కాటమయ్య శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి వర్గానికీ అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తుందనడానికి ఈ సమావేశమే నిదర్శనం అన్నారు. మేకల రామాంజనేయులు రైతులు, ప్రజలకు తన వంతుగా సరైన సేవలందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో అధికారి నరసింహారెడ్డి, నాయకులు రమేష్, గొట్లూరు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.


రామంజనేయులును సన్మానిస్తున్న టిడిపి నాయకులు

## ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం

**ప్రజాశక్తి-పెనుకొండ టౌన్**

పట్టణంలోని బ్రహ్మకుమారి విశ్వ విద్యాలయంలో గురువారం రాజయోగిని డా. హేమలత సిస్టర్ అధ్యక్షతన రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతల అభినందన సభ నిర్వహించారు. హేమలత మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత జాబిలి చాంద్ బాషా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు గుట్టూరు హెచ్ఎం నాగార్జున, ఉపాధ్యాయులు అమీర్వలిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే హెచ్ఎం హరికిరణ్, ఉపాధ్యాయులు శేషప్ప, రిటైర్డ్ హెచ్ఎం శ్రీనివాసులు, బిసి స్టడీ సర్కిల్ అధికారిణి సుమన జయంతిని సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతిలత, బ్రహ్మకుమారీలు, ఉపాధ్యాయులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన బ్రహ్మకుమారీలు

## పౌష్టికాహారంపై అవగాహన

**ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్**

మండలంలోని పెద్దకమ్మవారిపల్లి గోకులం అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం ఐసిడిఎస్ సూపర్వైజర్ సుజాత, వైద్యాధికారిణి భవ్య ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ మాట్లా డుతూ గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందజే యాలన్నారు. పిల్లలకు చిరుతిళ్లు పెట్టకూడదని, ఆకుకూరలు, కూరగాయలు, ధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను తినిపించాలి తెలిపారు. ప్రతినెలా అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎత్తు నమోదు చేయాలన్నారు. పట్టణ అర్బన్ ప్రాథమిక వైద్యాధికారిని భవ్య మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ఆహారపు అలవాట్లు ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం వైద్యాధికారి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలులు చంద్రకళ, పరిమళ, సరోజమ్మ, అమృత, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు సులోచన,ఉమ, నర్మదా, జానకి, శాంతి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్

**గాండ్లపెంట :** మండలంలోని మల్లమీదపల్లి పంచాయతీలోని 9 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మహోత్సవాలు నిర్వహించినట్లు అంగన్వాడీ సూపర్వైజర్ పద్మావతమ్మ తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహేశ్వరి మారుతి, టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య, ఎంపిటిసి ప్రతాపరెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, సుమలత, కమలమ్మ, వాసవీ, సుకన్య, రెడ్డమ్మ పాల్గొన్నారు.

## పక్కాగా ఓటరు నమోదు :తహశీల్దార్

**ప్రజాశక్తి-లేపాక్షి**

ఓటరు నమోదు ప్రక్రియ పక్కాగా చేపట్టాలని తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం తహశీల్దార్ ఆధ్వర్యంలో మండలంలోని బూత్ స్థాయి అధికారు లతో సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అధికారులు ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పక్కాగా తయారు చేయాలని ఆదేశించారు. మృతి చెందిన వారి వివరాలు సేకరించి రికార్డుల్లో తొలగించాలన్నారు. ఎవరినీ రెండు, మూడు చోట్ల నమోదు చేయకూడదన్నారు. ఒకవేళ అలా ఉంటే ఓటరు జాబితాను పరిశీలించి తొలగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ కుమార్రెడ్డి, వన్నూరప్ప, అశోక్, గంగరత్నమ్మ, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్

## పొలాల్లో పొలంబడి

**ప్రజాశక్తి-రొద్దం**

సిఫారసు మేరకు మాత్రమే పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులు వాడాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. ఇండియా జిఎపి సర్టిఫికేషన్, ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతుల కోసం మండలంలో ఎఫ్పిఓ ద్వారా రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థకు నమోదు చేసుకోబడిన గౌరాజపల్లి గ్రామానికి సంబంధించిన 30 మంది రైతుల పొలాలు, రికార్డులను గురువారం జిల్లా అధికారి బి.వెంకటేష్ పరిశీలించినట్లు ఏఓ రాజేష్ తెలిపారు. వారు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక మోతాదులో వాడితే పంట ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాల కారణంగా మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ ప్రాముఖ్యతను తెలిపారు. ధ్రువీకరణ పొందిన పంట ఉత్పత్తులను ఎఫ్పిఓల ద్వారా అధిక ధరకు కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. పురుగు మందుల అవశేషాల పరీక్ష నిమిత్తం విత్తన నమూనాలను సేకరించి ల్యాబ్కి పంపించారు. వారి వెంట క్యూ ఎం ఎస్ మేనేజర్ శాంతమ్మ, ఏఈఓ హంసవేని, విఎఎ హరీష్, వ్యవసాయ, ఎఫ్పిఓ సిబ్బంది ఉన్నారు.

పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

పసుపు రంగు దుస్తులతో అసెంబ్లీ వద్ద జిల్లా మహిళా ఎమ్మెల్యేలు

## పసుపు రంగు చీరలతో అసెంబ్లీకి హాజరైన ఎమ్మెల్యేలు

**ప్రజాశక్తి-కొత్తచెరువు**

దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మహిళా ఎమ్మెల్యేలు గురువారం పసుపు రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరయ్యారు. వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి కూడా ఉన్నారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు పసుపు రంగు దుస్తులు ధరించి అసెంబ్లీకి హాజరవడం అందరినీ ఆకట్టుకుంది.

## కనకదాసు విగ్రహావిష్కరణకు తరలివెళ్దాం

**ప్రజాశక్తి-రొద్దం**

తిరుపతి నగరంలో అక్టోబర్ 5వ తేదీ నిర్వహించతలపెట్టిన కురుబల ఆరాధ్య దైవం శ్రీభక్త కనకదాసు కాంస్య విగ్రహావిష్కరణకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కురుబ కులస్తులు తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ అంశంపై గురువారం పెన్నా నది ఒడ్డున ఉన్న రుద్ర పాదాశ్రమం వద్ద కురుబ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా గోడ పత్రికలు విడుదల చేశారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు, కురుబ కులస్తులు పాల్గొన్నారు.

## పనులు నాణ్యతగా చేయాలి

**ప్రజాశక్తి-మడకశిరటౌన్**

నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచాలని పిఆర్ డీఈ వెంకటేశులు కోరారు. స్థానిక పిఆర్ కార్యాలయంలో గురువారం నియోజక వర్గంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. సీసీ రోడ్లు, ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బస్ షెల్టర్లు, తదితర పనులపై మండలాల వారీగా సమీక్షించారు. ఆయా పనులను వేగవంతంగా చేయాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో పిఆర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈ పాస్ మిషన్ల ద్వారా రేషన్ పంపిణీ

**ప్రజాశక్తి-రొద్దం**

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నూతన ఈ పాస్ మిషన్లతో బియ్యం పంపిణీ చేసే విధానాన్ని గురువారం ఆర్డీవో ఆనంద్కుమార్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. లబ్ధిదారుల చేత ఈ పాస్ మిషన్లో వేలిముద్ర వేయించి బియ్యం పంపిణీ చేశారు. అనంతరం బిఎల్ఓల పనితీరుపై ఆరా తీశారు. వారి వెంట తహశీల్దార్ ఉదయ్శంకర్ రాజ్, ఆర్ఐ, విఆర్ఓలు రాము, సూరి, అనిల్కుమార్, శ్రీదేవి, అనూష, సివిల్ సిఓ అశోక్, డీలర్ హనుమంతు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఫ్రెండ్స్ షటిల్ టోర్నీ

**ప్రజాశక్తి-ధర్మవరం రూరల్**

పట్టణంలోని ఎన్జిఓ హోంలో శుక్రవారం నుంచి షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డోలా రాజారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో మొత్తం 40 టీములు పాల్గొంటున్నాయన్నారు. క్రీడాకారులకు అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. ప్రారంభ పోటీలకు ముఖ్య అతిథులుగా శేఖర్, సంధిరెడ్డి శ్రీనివాస్రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మజ్జిగ భాస్కర్, సీతారామయ్య, భగవంత్రెడ్డి, బ్రహ్మారెడ్డి, జనా, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న టోర్నమెంట్ నిర్వాహకులు

## సరిహద్దులో పటిష్ట నిఘా

**ప్రజాశక్తి-పెనుకొండ**

కర్నాటక సరిహద్దులో పటిష్టమైన నిఘా పెంచాలని ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రొహి బిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగ మద్దయ్య ఆదేశించారు. ఆయన గురువారం పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్ను సందర్శించి రికార్డులను పరిశీలిం చారు. ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో కర్నాటక సరిహద్దు ఉన్నందున మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలన్నారు. మద్యం వ్యాపారు లు సమయ పాలన పాటించాలని, కర్నాటక మద్యం కేసులు నమోదు చేయాలని సూచించారు. ఆయన వెంట అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. నరసింహులు, ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య

**మద్యం అక్రమ రవాణాను నియంత్రించాలి**

**ధర్మవరం రూరల్ :** మద్యంపై అక్రమ విక్రయాలపై కేసులు నమోదు చేయాలని ఉమ్మడి అనంత పురం జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏఈఎస్ నరసింహులు ఆదేశం చారు. వారు పట్టణంలోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ కేసులను పరిశీలించారు. నాటు సారా తయారీ, విక్రయం, కర్నాటక మద్యాన్ని అరికట్టాలన్నారు. రూట్ వాచ్లు నిర్వహించి, ఎక్సైజ్ శాఖకు మంచి గుర్తింపు తీసుకు రావాలని సూచించారు. వారి వెంట సిఐ ఎన్.చంద్రమణి, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## కదిరి విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో ప్రశంసలు

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కదిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్గా పని చేస్తున్న సి.రహంతుల్లా కుమార్తె అఫ్రిన్ 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాల్లో 596 మార్కులు సాధించింది. ఆమె క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీలో రాష్ట్రంలోని ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల్లో ద్వితీయ ర్యాంకు పొందింది. దీంతో విజయవాడలో జరిగిన జరిగిన సిసిఎస్ రాష్ట్ర మహాసభలో అఫ్రిన్ ఎపిఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం, సిసిఎస్ వైస్ చైర్మన్ నాగేంద్రప్రసాద్ నుంచి నుంచి ప్రసంశా పత్రం, రూ. 1500 నగదు అందుకున్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వినోద్కుమార్, కదిరి డిపో సిసిఎస్ డేలిగేట్లు ఎన్.వి.రమణ, సి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు. కదిరి డిపోనకు పేరు ప్రతిష్ఠలు తెచ్చిన అఫ్రిన్కు కదిరి డిపో ఉద్యోగులు బైరిశెట్టి, అశ్వర్థమయ్య, రామచంద్ర, రవీంద్ర, మాజీ డేలిగేట్ హరిమోహన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ ఎండి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న అఫ్రిన్

## పిన్నదరిలో మెగా వైద్యశిబిరం

**ప్రజాశక్తి-తాడిమర్రి**

'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' లో భాగంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు సంస్కృతి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో బెంగళూరులోని వైట్ ఫీల్డ్ వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో మండలంలోని పిన్నదరి గ్రామంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి కార్యాలయ ఇన్ఛార్జి హరీష్బాబు హాజరయ్యారు. ఆయన ముందుగా పండిట్ దీన్దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రజలకు లభించే ఆరోగ్య సేవలను పరిశీలించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైద్య శిబిరంలో వివిధ జబ్బులకు ప్రముఖ వైద్య నిపుణులు సేవలందించారు. వివిధ రకాల పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నాయకులు దేవర రాము, కూచి రాము, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంకా నాగార్జున, భూషణ్, చంద్ర, రమేష్, పార్థ, రమణ, ఆరవేటి, ఆనంద్, పెద్దయ్య పాల్గొన్నారు.

శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు

## ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం

**ధర్మవరం రూరల్ :** పట్టణంలో గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మాసిస్టు డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ధర్మవరం కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు బద్రీనాథ్ మాట్లాడుతూ ఫార్మాసిస్టులు రోగులు, డాక్టర్లకు వారధిగా నిలిచి సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఫార్మాసిస్టులు సమాజానికి చేస్తున్న సేవలను కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ త్రిపేంద్ర నాయక్ చేతుల మీదుగా 250 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరామ్, పిఆర్ఓ రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు సుంకు సుకుమార్, సహకార్యదర్శి రమేష్బాబు, డాక్టర్ బివి.సుబ్బారావు, పోలా ప్రభాకర్, చాంద్బాషా, వైకె.శ్రీనివాసులు, సత్రశాల మల్లికార్జున, కేతా లోకేష్, బాలం ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

## సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

**ధర్మవరం రూరల్ :** పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో సెలవుల్లో తరగతులు నిర్వహించరాదని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఇఒలు గోపాల్నాయక్, రాజేశ్వరిదేవి గురు వారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులకు కూడా ఎట్టి పరిస్థితుల్లో తరగతులు నిర్వహించరాదన్నారు. విద్యార్థులను విహారయాత్రలకు కూడా తీసుకెళ్లరాదన్నారు. వెళ్లాల్సి వస్తే డిఇఒ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రమాదాలకు గురైతే పాఠశాల యాజమాన్యందే బాధ్యత అన్నారు. తల్లిదండ్రులు పిల్లలను నీరు ఉన్న ప్రదేశాలకు ఒంటరిగా పంపరాదని సూచించారు.

## కదిరిలో భక్తుల గిరి ప్రదక్షిణ

**ప్రజాశక్తి-కదిరి అర్బన్**

పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి 4 కిలోమీటర్ల దూరంలో కుమ్మరవాండ్ల పల్లి గ్రామ సమీపంలోని కదిరి కొండపై శ్రీవారు చెంచులక్ష్మీ సమేతంగా వెలిశారని భక్తులు విశ్వసిస్తారు. ఈ క్రమంలో శ్రీవారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం రోజున కదిరికొండకు భక్తులు గిరి ప్రదక్షిణ చేస్తారు. ముందుగా ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ తూర్పు రాజగోపురం నుంచి భక్తులు పాదయాత్రగా బయల్దేరతారు. స్తోత్రాద్రికి హారతి ఇచ్చిన అనంతరం గోవింద నామస్మరణ, భజనలతో గిరిప్రదక్షిణ పూర్తి చేస్తారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు ఆలయ అధికారులు, పట్టణ ప్రముఖులు వేణుగోపాల్, సురేంద్రకుమార్, కార్తీక్, సుబ్రమణ్యం, విష్ణువర్ధన్, నామా రాము, బుల్లెట్ ఆచారి, తరుణ్, వారి కుటుంబ సభ్యులు అల్పాహారం ఏర్పాటు చేశారు. శ్రీఖాద్రీ లక్ష్మీ నృసింహ సేవా సమితి సభ్యులు మజ్జిగ, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు. గిరి ప్రదక్షిణకు సరైన మార్గం లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆలయ అధికారులు, పాలకులు, పట్టణ ప్రముఖులు చొరవ తీసుకొని గిరి ప్రదక్షిణకు సరైన మార్గం ఏర్పాటు చేయడంతో పాటు భక్తుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న శ్రీవారి భక్తులు